Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

స్పాట్ ఎడిషన్


epaper.telanganaveena.com హైదరాబాద్ బుధవారం 19.06.2024


## డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన

# పవన్ కల్యాణ్

తెలంగాణవీణ, ఏపీ బ్యూరో

జనసేనఅధినేత,పిఠాపురంనియోజకవర్గంఎమ్మెల్యే కొణిదల పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూఎస్, పర్యావరణ, శాస్త్రసాంకేతిక, అటవీశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఛాంబర్ లో పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పవన్ పాల్గొన్నారు. అనంతరం చాంబర్ లో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించి.. దస్త్రాలపై సంతకాలు చేశారు.





## నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్‌ను

# ప్రారంభించిన ప్రధాని మోడీ



తెలంగాణవీణ,జాతీయం

బీహార్‌లోని రాజ్‌గిర్‌లో చారిత్రక నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్‌ను ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం ప్రారంభించారు. ఉదయం నలంద యూనివర్శిటీకి చేరుకున్న ప్రధాని మోదీ ముందుగా యూనివర్సిటీలోని పాత వారసత్వాన్ని నిశితంగా పరిశీలించారు. అనంతరం ఇక్కడి నుంచి కొత్త క్యాంపస్‌కు చేరుకున్న ఆయన అక్కడ బోధి వృక్షాన్ని నాటిన అనంతరం నూతన ప్రాంగణాన్ని ప్రారంభించారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, బీహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ముఖ్యమంత్రి నితీష్ కుమార్, నలంద యూనివర్సిటీ ఛాన్సలర్ అరవింద్ పనగారియా ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, భూటాన్, బ్రూనై, దారుస్సలాం, కంబోడియా, చైనా, ఇండోనేషియా, లావోస్, మారిషస్, మయన్మార్, న్యూజిలాండ్, పోర్చుగల్ , సింగపూర్, దక్షిణ కొరియా, శ్రీలంక మరియు వియత్నాం సహా మొత్తం 17 దేశాల నుండి విదేశీ రాయబారులు కూడా ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. 2016లో నలంద శిథిలాలు ఐక్యరాజ్యసమితి వారసత్వ ప్రదేశంగా ప్రకటించబడిందని, ఆ తర్వాత 2017లో యూనివర్సిటీ నిర్మాణ పనులు ప్రారంభించబడ్డాయని తెలిసిందే. విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్ నలంద పురాతన శిథిలాల సమీపంలో నిర్మించబడింది. ఈ కొత్త క్యాంపస్ నలంద విశ్వవిద్యాలయ చట్టం, 2010 ద్వారా స్థాపించబడింది. 2007లో ఫిలిప్పీన్స్‌లో జరిగిన రెండవ తూర్పు ఆసియా సదస్సులో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసేందుకు చట్టం ఏర్పాటు చేసింది.

# పొటెం స్పీకర్‌గా గోరంట్ల..

## కాల్ చేసిన మంత్రి పయ్యావుల

తెలంగాణవీణ, ఏపీ బ్యూరో

- ఏపీ అసెంబ్లీ ప్రొటెం స్పీకర్ గా సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి
- ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించాలని బుచ్చయ్య చౌదరికి ఫోన్ చేసిన కోరిన మంత్రి పయ్యావుల కేశవ్
- రేపు బుచ్చయ్య చౌదరితో ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం స్వీకారం చేయించనున్న గవర్నర్
- ఈ నెల 21.. 22 తేదీల్లో ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారం చేయించనున్న బుచ్చయ్య





టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరికి మంత్రి పయ్యావుల కేశవ్ ఫోన్ చేశారు.. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతోన్న తొలి అసెంబ్లీ సమావేశాల్లో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించాలని సీనియర్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరిని కోరారు పయ్యావుల.. దీనికి గోరంట్ల బుచ్చయ్య చౌదరి అంగీకారం తెలిపినట్టు చెబుతున్నారు.. దీంతో, రేపు బుచ్చయ్య చౌదరితో ముందుగా ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం స్వీకారం చేయించనున్నారు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్.. అయితే, తెలుగు దేశం పార్టీలో సీనియర్ లీడర్ అయిన బుచ్చయ్య చౌదరి.. ఏడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు తర్వాత ఏడుసార్లు ఎమ్మెల్యే అయిన వ్యక్తి బుచ్చయ్య చౌదరి.. ఇక, ఈ నెల 21, 22 తేదీల్లో ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు నిర్ణయించిన ప్రభుత్వం.. ఆ దిశగా ఏర్పాట్లు చేస్తుంది.. ఈ సమావేశాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైసీపీ అధినేత వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి సహా సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు బుచ్చయ్య చౌదరి. ఆ తర్వాత స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు.. స్పీకర్‌గా మరో సీనియర్ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు పేరు వినిపిస్తోన్న విషయం విదితమే. కాగా, సార్వత్రిక ఎన్నికల్లో రాజమండ్రి రూరల్ స్థానం నుంచి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విజయం సాధించిన విషయం విదితమే..

# తెలంగాణలో ప్రక్షాళన వేగవంతం

## ఐఏఎస్ అధికారుల బదిలీపై

## కొనసాగుతున్న సస్పెన్స్




తెలంగాణవీణ, హైదరాబాద్

తెలంగాణలో మరికొందరు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసే అంశంపై సర్కారు కసరత్తు చేస్తోంది. ఈసారి కొంతమంది సీనియర్ ఐఏఎస్‌లకు కూడా స్థానచలనం ఉండొచ్చని తెలుస్తోంది. శనివారం 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం..10 మంది ఐఏఎస్ అధికారులకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రస్తుతం వీరంతా వెయిటింగ్‌లో ఉన్నారు. వీపీ గౌతమ్, పి.ఉదయ్ కుమార్, పమేలా సత్పతి, భవేశ్ మిశ్రా, యాస్మిన్ బాషా, జి.రవి, హరిచందన దాసరి, ఎస్.వెంకటరావు, త్రిపాఠి, ఆల ప్రియాంకలకు పోస్టింగులు ఇవ్వాల్సి ఉంది. వీరితో పాటు కొంతమంది సీనియర్ అధికారులను కూడా బదిలీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. బీఆర్ఎస్ హయాంలో నియమితులై, ఇప్పటికీ కంటిన్యూ అవుతున్న అధికారులు, ఒకే పోస్టులో దీర్ఘకాలికంగా ఉన్నవారిని బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయి.రాష్ట్రంలో అత్యంత కీలకమైన వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖలకు ముఖ్య కార్యదర్శి లేరు. ఇప్పటివరకు ఈ రెండు శాఖలకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సునీల్ శర్మ మే 31న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఈ పోస్టులో ప్రభుత్వం ఎవరిని నియమించలేదు. కనీసం అదనపు బాధ్యతలను కూడా ఎవరికి అప్పగించలేదు. ఈ బాధ్యతల కోసం రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కూడా ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో రాబడి ఎక్కువగా ఉండే ఈ రెండు శాఖలకు సమర్థుడైన అధికారిని నియమించాల్సిన అవసరం ఉంది. దీంతో ప్రభుత్వం తీవ్రంగానే కసరత్తు చేస్తోంది. సమర్థుడైన సీనియర్ అధికారిని నియమించడంపై దృష్టి పెట్టింది. ఇక రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, అదనపు సీఈవో లోకేష్‌కుమార్, సంయుక్త సీఈవో సర్ఫరాజ్ అహ్మద్‌లను కూడా ప్రభుత్వంలోకి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. వీరికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా ఎవరిని ప్రతిపాదించాలన్న అంశంపైనా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అధికారులకు సంబంధించిన రహస్య నివేదికలు, ఇంటెలిజెన్స్ రిపోర్టులను తెప్పించుకుని పరిశీలిస్తోంది. త్వరలో ఐఏఎస్‌ల బదిలీలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటోంది.

# హజ్ యాత్రలో మృత్యుఘోష..

## ఎండ తీవ్రతకు 500 మందికి పైగా బలి



తెలంగాణవీణ,జాతీయం

హజ్‌యాత్రలో మృత్యుఘోష..50 డిగ్రీల ఎండకు 500 మందికి పైగా బలి..! హజ్‌యాత్రలో ఎండ తీవ్రరూపం దాలుస్తోంది. ఎండలు, ఉక్కపోతతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాత్రకు వెళ్లిన భక్తులు పిట్టల్లా రాలుతున్నారు. ఎండ వేడిమికి తాళలేక ఇప్పటివరకు 550 మందికి పైగా చనిపోయారు. మృతి చెందిన వారిలో ఈజిప్ట్, జోర్డాన్ దేశస్తులు అధికంగా ఉన్నారు. సుమారు 323 మంది ఈజిప్టియన్లు ఉండగా..60 మంది జోర్డానియన్లు కూడా మరణించారు. మొత్తంగా ఇప్పటివరకు చనిపోయిన వారి సంఖ్య 577కి చేరినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం మక్కాలో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడిమి నుంచి ఉపశమనం కలిగించేందుకు అక్కడి అధికారులు చర్యలు తీసుకుంటున్నా ప్రాణ నష్టం తప్పడం లేదు. వేడి సంబంధిత సమస్యలతో బాధపడిన సుమారు 2,000 మంది యాత్రికులకు చికిత్స అందిస్తున్నారు. గతేడాది కూడా హజ్ యాత్రలో 240కి పైగా మరణాలు నమోదయ్యాయి.మండిపోతున్న ఎండలతో హజ్ యాత్రికులు విలవిల్లాడుతున్నారు. ఏటా బక్రీద్ మాసంలో జరిగే ఈ యాత్రకు వివిధ దేశాల నుంచి లక్షల సంఖ్యలో యాత్రికులు తరలివస్తుంటారు. అయితే ఈసారి మాత్రం సౌదీలో రికార్డు స్థాయిలో 50 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఎండలకు వారంతా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. హజ్ యాత్ర చేసే వారిలో వృద్ధులు, మధ్య వయస్సు వారు ఎక్కువ మంది ఉంటుంటారు. వీరంతా ఎండ ధాటికి తట్టుకోలేక చనిపోతున్నారు.

## ఏపీలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాల ఉపఎన్నిక షెడ్యూల్ విడుదల




రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నిక షెడ్యూలు విడుదల అయ్యింది. ఈ నెల 25 తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు జూలై 2 తేదీన తుది గడువు కాగా, నామినేషన్ ల ఉపసంహరణ కు జూలై 5 తేదీ తుది గడువుగా ఈసీ నోటిఫికేషన్ లో పేర్కొంది. జులై 12 తేదీన ఎన్నికలు జరుగుతాయని అదేరోజు ఫలితాలు వెలువడుతాయని ఈసీ వెల్లడించింది.

## మీ దగరున్న ప్రభుత్వ ఫర్నిచర్‌ను వెంటనే వెనక్కి ఇవ్వండి.. జగన్‌కు సచివాలయ జీఏడీ లేఖ

* ఓటమి పాలైన 15 రోజుల్లో ప్రభుత్వ ఫర్నిచర్‌ను వెనక్కి ఇవ్వాలని నిబంధనలు
* నేటితో గడువు ముగుస్తున్నా జగన్ నుంచి రాని స్పందన
* జగన్ వద్ద ఉన్న వస్తువులతో లేఖ రాసిన సచివాలయ జీఏడీ